# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 24-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి : 26 | సంచిక: 256 | పేజీలు: 4 | వెల: రూ. 1/-


## మిమిక్రీ ఆర్టిస్ట్ హరికిషన్ కన్నుమూత

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, నటుడు హరికిషన్ (57) కన్నుమూసారు. పాతతరం హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్ బాబు, చిరు, నాగార్జున, బాలయ్యలతో పాటు ఈతరం హీరోలు పవన్,మహేష్ ఇలా పలువురు హీరోల గొంతులని ఎంతో అద్భుతంగా అనుకరిస్తూ వచ్చారు. రాజకీయనాయకుల గొంతులని కూడా అనుకరించడంలో ఆయన దిట్ట అని చెప్పవచ్చు. హరికిషన్.. మే 30, 1963న ఏలూరులో జన్మించారు. 8 ఏళ్ల వయసులోనే తన గురువులను తోటి వాళ్ల గొంతులను మిమిక్రీ చేయడాన్ని ప్రారంభించారు. ఆయన మిమిక్రీకి ఎంతో మంది ముగ్ధులు కాగా, సెలబ్రిటీలు కూడా తన టాలెంట్‌కి ఫిదా అయ్యారు. హరికిషన్ కేవలం మిమిక్రీ మాత్రమే కాక పశు పక్ష్యాదుల శబ్దాలతో పాటు యంత్రాలు చేసే శబ్దాలు.. సంగీత వాద్య పరికరాల సౌండ్స్‌ను తన గొంతులో పలికించారు. దేశ విదేశాలలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చిన హరికిషన్ ప్రముఖ నటుడు శివారెడ్డికి గురువు కూడా. మిమిక్రీలో తనకంటూ ప్రత్యేక స్థానం లిఖించుకున్న హరికిషన్ మృతి తెలుగు వారికి తీరని విషాదాన్ని మిగిల్చింది. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తున్నారు

# నిప్పుల కొలిమిలా దేశ రాజధాని

### ఉత్తరాది రాష్ట్రాల్లో భారీగా ఉష్ణోగ్రతలు
### పలు రాష్ట్రాల్లో వేడిగాలులతో ఉక్కపోత
### తెలుగు రాష్ట్రాల్లో వడగాలు భయం
### రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ,మే23(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీ ఒకవైపు కరోనా వైరస్‌తో, మరోవైపు అత్యధిక ఎండవేడిమితో పోరాడుతోంది. లాక్‌డౌన్ 4.0లో కొన్ని సడలింపులు ఉన్నప్పటికీ జనం అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా అవస్థలు పడుతున్నారు. రాజధానిలో ప్రస్తుతం 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు దాటాయి. అదే విధంగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ ఢిల్లీలలో వేడి గాలులు వీస్తున్నాయి. వాతావరణశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వచ్చేవారంలో కూడా ఇదే స్థాయి ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశాలున్నాయి. అమ్ఫాన్ తుఫాను తరువాత ఉత్తర, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో సోమవారం వరకు వేడి గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణలో ఆదివారం వరకు ఇటువంటి పరిస్థితులు కొనసాగనున్నాయి. దక్షిణ భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉదయం ఏడుగంటలకే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రంలో భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఫలితంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. ఉదయం 7గంటలకే ఇంటి నుంచి అడుగుబయటపెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక మధ్యాహ్నం అయితే.. నిప్పుల వర్షం కురిసినట్టే అనిపిస్తోంది. ఇక శనివారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మొత్తంగా రాష్ట్రంలో భానుడు భగభగమన్నాడు. శుక్రవారం నాలుగు చోట్ల తీవ్ర వడగాడ్పులు, పలుచోట్ల వడగాడ్పులు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. 45 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదైతే వడగాడ్పులుగా ప్రకటిస్తారు. 47 డిగ్రీలు, ఆపైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైతే తీవ్ర వడగాడ్పులుగా ప్రకటిస్తారు. ఆ ప్రకారం శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లె మండలం పెంట్లాం, నల్లగొండ జిల్లా అనుముల హాలియా మండలం హాలియా, అదే జిల్లా కనగల్, పెద్దపల్లి జిల్లా మంథనిలలో ఏకంగా 47 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి వెల్లడించారు. అలాగే ఖమ్మం, కొల్వి, ధర్మపురి, దామరచర్ల, దుమ్ముగూడెం, మొగుళ్లపల్లి, జైనా, జూలూరుపాడు, ఏన్కూరు, పాత ఎల్లాపూర్, సోన్ ఐబీ, మామిడాల, జన్నారం, భోరాజ్, నామాపూర్, బొమ్మిరెడ్డిపల్లె, ఉర్లుగొండల్లో 46 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. ఇక ఆదిలాబాద్, నల్లగొండ, నిజామాబాద్‌లలో 45 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాచలం, హన్మకొండ, మహబూబ్‌నగర్, మెదక్, రామగుండంలలో 44 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాలులతో రాష్ట్రంలో జనం ఇబ్బందులు పడ్డారు. అనేకమంది విలవిలలాడిపోయారు. ఉత్తర బంగ్లాదేశ్ దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడి అల్పపీడనంగా మారింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్రంలో శని, ఆదివారాల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని రాజారావు తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నల్లగొండ, సూర్యాపేట.. మొత్తంగా 17 జిల్లాల్లో అక్కడక్కడ వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

ప్రధానంగా ఆదిలాబాద్, కుమ్రంభీంఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 నుంచి 46 డిగ్రీల మధ్య నమోదైనట్టు పేర్కొన్నారు. ఖమ్మంలో 46 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 45.3 డిగ్రీలు, భద్రాచలం, హన్మకొండలో 44 డిగ్రీల చొప్పున, హైదరాబాద్‌లో 42.7 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 44 డిగ్రీలు, మెదక్‌లో 43.8 డిగ్రీలు, నల్లగొండలో 45 డిగ్రీలు, నిజామాబాద్‌లో 44.9 డిగ్రీలు, రామగుండంలో 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని, అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇంటికే పరిమితం కావాలని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువగా నీళ్లు తాగాలని చెబుతున్నారు. గొంతు ఎండిపోకుండా తరుచూ నీళ్లు తాగాలని, లేనిపక్షంలో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ వేసవిలో ప్రధానంగా పిల్లలు, వృద్ధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వారిని తరుచూ గమనిస్తూ ఉండాలని చెబుతున్నారు. మధ్యాహ్నం మజ్జిగ తాగితే మంచిదని చెబుతున్నారు. ఎక్కువగా కొబ్బరినీళ్లు, వివిధ పండ్ల రసాలు తీసుకోవాలని, శీతలపానీయాలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## జంటనగరాల్లో రవాణా కోసం జనం ఎదురుచూపు

### ఆర్టీసీ, మెట్రో సర్వీసుల కోసం తప్పని తిప్పలు
### కరోనా మార్గదర్శకాల తరవాతనే నడిచే ఛాన్స్

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): ప్రజారవాణా కోసం నగరవాసులు ఎదురు చూస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే ఆర్టీసీ, మెట్రో సర్వీసులు నడవకపోవడంతో అనేకులు ఇబ్బంది పడుతున్నారు. జంటనగరాల్లో కరోనా కేసులు పెరగడంతో దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదు. సిఎం కెసిఆర్ కూడా ఇప్పట్లో బస్సులు నడిపేది లేదన్నారు. అలాగే మెట్రో సేవలపైనా అదే వైఖరితో ఉన్నారు. ఇప్పటికే ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జంటనగరాల్లో మాత్రం రావాల్సి ఉంది. జనతా కర్ఫ్యూ విధించిన మార్చి 22 నాటి నుంచే హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపారాలు తిరిగి తెరుచుకున్నా.. హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో ఆర్టీసీ సేవలు ప్రారంభం కాకపోవడంతో ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సగటున 4 లక్షల మందికి సేవలు అందిస్తున్న మెట్రో రైళ్లు గ్రేటర్ హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో మెట్రో సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. అయితే.. కరోనా నివారణ, లాక్‌డౌన్ మార్గదర్శకాలను ప్రయాణికులు మెట్రో స్టేషన్లలో, రైళ్లలో కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటారు. మాస్కులను ధరించడం, భౌతికదూరం, శానిటైజర్లను అందుబాటులో పెట్టడం వంటి జాగ్రత్తలు తప్పనిసరి. మెట్రో పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతి రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కరోనా లాక్‌డౌన్‌తో నిలిచిపోయిన హైదరాబాద్ మెట్రోరైలు సేవలు జూన్ 1 తర్వాత పునఃప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆర్టీసీ సర్వీసులతో పాటు, మెట్రో సేవలనకు కూడా పరిమితంగా నడపాలని చూస్తున్నారు. భౌతిక దూరం పాటించేలా ఏర్పాట్లు చేసిన తరవాత ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# పోలీస్ శాఖలో కరోనా కలకలం

### పాజిటివ్ కేసుల సంఖ్య పదికి చేరిక
### బోయినపల్లి కానిస్టేబుల్‌కు పాజిటివ్

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): పోలీస్‌శాఖలో కరోనా కలకలం రేపుతోంది. పోలీస్ శాఖలో పాజిటివ్ కేసుల సంఖ్య 10కి చేరింది. ఇప్పటికే తొమ్మిది మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఒక కానిస్టేబుల్ మృతి చెందారు. తాజాగా బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పది రోజుల క్రితం గాంధీ ఆసుపత్రిలో బాధిత కానిస్టేబుల్ విధులు నిర్వర్తించారు. ఆయనతో పనిచేసిన వారికి సైతం వైద్య పరీక్షలు నిర్వహించారు. తోటి సిబ్బందిని హోమ్ క్వారంటైన్‌కు తరలించారు. ఇదిలావుంటే సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడిలో కరోనా కలకలం రేపింది. హైదరాబాద్‌లో ఉంటున్న కూచిపూడి గ్రామానికి చెందిన సీఐ అనారోగ్యం పాలవ్వడంతో ఇద్దరు గ్రామస్థులు పరామర్శించి వచ్చారు. తాజాగా సీఐకి పాజిటివ్ రావడంతో ఆయన్ను కలిసిన ఇద్దరితో పాటు వారు కలిసిన మరో 25 మంది గ్రామస్థులను వైద్య సిబ్బంది హోం క్వారంటైన్‌లో ఉంచారు.

# రంజాన్ కళతప్పిన హైదరాబాద్

### లాక్‌డౌన్‌తో ఇల్లకే పరిమితమైన పండగ ప్రార్థనలు

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): అన్ని పండగలలాగే రంజాన్ పండగా కళతప్పింది. హైదరాబాద్‌తో ఎంతో అనుబంధం కలిగి ఉన్న రంజాన్ ఈ యేడు ఎలాంటి శోభను కనబర్చలేదు. లాక్‌డౌన్, కరోనా భయంతో రంజాన్ పండగ ఇళ్లకే పరిమితం అయ్యింది.

నిత్యం కళకళలాడే హైదరాబాద్ చార్మినార్ ఏరియా రంజాన్ వచ్చిందంటే మరింత వెలుగులు నింపేది. కరోనా ఎఫెక్ట్‌తో ఈసారి పాతబస్తీ కళ తప్పింది. అంతేగాకుండా రంజాన్ హలీం రుచి చూడకుండా ఉండని హైదరాబాదీలకు కరోనా దెబ్బకొట్టింది. రంజాన్ హలీంతో పాటు, ప్రత్యేక బిర్యానీలు లేకుండా పోయాయి. రంజాన్ నెలలో చార్మినార్ నుంచి మదీనా సర్కిల్ వరకు వచ్చిపోయే జనాలతో షాపులు నిత్యం రద్దీగా ఉండేవి. రోడ్డుకు రెండువైపులా షాపులు, వాటి ముందు తోపుడు బండ్ల కొనుగోళ్లతో కిటకిటలాడేవి. డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్స్, మసాలా దినుసులు, సేమియా, బట్టలు, బుర్ఖాలు, ఖురాన్లు, ఖురాన్ స్టాండ్స్, అత్తర్, సుర్మా, టోపీలు, కాస్మొటిక్స్, హౌస్ హోల్డింగ్స్ ఇలా అన్ని బిజినెస్‌లూ ఫుల్‌గా నడిచేవి. ప్రస్తుతం ఓల్డ్ సిటీలో ఆ సీన్ కనిపించడం లేదు. రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి.

దీనికితోడు ఏటా కొత్త బట్టలు కొనుక్కునే ముస్లింలకు ఆ అదృష్టం కూడా దూరమయ్యింది. కరోనా ఎఫెక్ట్‌తో ట్రాన్స్‌పోర్ట్ లేకపోవడం వల్ల ఓల్డ్ స్టాక్‌నే అమ్ముతున్నామని వ్యాపారులు తెలిపారు. తోపుడు బండ్లు పెట్టే 50 వేల మందికి పైగా చిరువ్యాపారులు ఈ నెలలో లక్షకు పైగా ఆదాయం పొందేవారు. ప్రస్తుతం ఇల్లు గడవని పరిస్థితి ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. ఓల్డ్ సిటీలో కొన్ని కుటుంబాలు చేసే సేమియా బేగంబజార్, చార్మినార్‌తోపాటు జిల్లాలకు ఎక్స్‌పోర్ట్ అవుతుంది. తమ ఆదాయం కూడా ఆగిపోయాయని తయారీదారులు వాపోతున్నారు. చార్మినార్ దగ్గర బండి పెట్టుకుని గాజులు, కాస్మొటిక్స్ అమ్మేవారు సైతం రోడ్డున పడ్డారు.

# ప్రధాని మోడీది ఫ్యూడల్ మనస్తత్వం

### నిధులు విడుదలలో నిరంకుశ ధోరణి
### మండిపడ్డ ఎంపి రంజిత్ రెడ్డి

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీ ఫ్యూడల్‌గా వ్యవహరిస్తున్నారని ఎంపీ రంజిత్ రెడ్డి మండిపడ్డారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలందరం మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై రాష్ట్ర బీజేపీ ఎంపీలు పోరాటం చేయాలని సూచించారు. ఆంక్షలు పెడుతూ ఎఫ్ఆర్‌బీఎం రుణపరిమితి పెంచారు. రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రగతి నివేదనతో ప్రజల ముందుకు ఎంపీ రంజిత్ రెడ్డి వచ్చారు. ప్రజాసేవ చేయడం ఒక గొప్ప అవకాశం.. అది తనకు దక్కడం అదృష్టం.. ఎంపీగా అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు రంజిత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చెప్పిన హెలికాప్టర్ మనీని ప్రధాని మోదీ పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వంపై అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కు రంజిత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వంపై విమర్శలు మాని.. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కొట్లాడమని చెప్పారు. ఏడాదిగా ఎంపీ అరవింద్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగింపు కోసం కృషి చేస్తానని ఎంపీ రంజిత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇంటిపట్టునే ఉన్న యువకుడికి కరోనా

### గాంధీఆస్పత్రికి తరలించిన పోలీసులు

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): ఇంట్లో ఉన్నప్పటికీ ఓ యువకుడిని కరోనా వదల్లేదు. సనత్‌నగర్ పరిధిలోని అశోక్ కాలనీలో ఓ యువకునికి(25) కరోనా పాజిటివ్ అని తేలింది. గత రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత యువకుడు.. ఇంటికే పరిమితం అయ్యారు. బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతూ మెడిసిన్ వాడుతున్నాడు. అయితే తాజాగా అతను టెస్టులు చేయించుకోవడానికి వెళ్లగా.. కరోనా టెస్టులు కూడా చేశారు. ఈ టెస్టుల్లో అతనికి కరోనా పాజిటివ్ అని తేలింది. యువకుని సోదరులు బయటకు వెళ్లి వచ్చిన సందర్భంలో వారి నుంచి వైరస్ రావొచ్చని వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే యువకుడి కుటుంబ సభ్యులందరికీ మెడికల్ టెస్టులు చేస్తున్నారు. వారందరినీ ఇంట్లోనే హోం క్వారంటైన్ చేశారు. కాగా, పాజిటివ్ వచ్చిన యువకున్ని గాంధీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

## కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

### ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే: సిపి

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): కరోనావైరస్ సోకి చనిపోయిన కానిస్టేబుల్ దయాకర్ రెడ్డి కుటుంబాన్ని నఅ÷-నివిధాలుగా ఆదుకుంటామని హైద్రాబాద్ సీపీ అంజనీకుమార్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని హైద్రాబాద్ సీపీ అంజనీకుమార్ రెండు నిమిషాలు మౌనం పాటించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని కులసుం పుర పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దయాకర్ రెడ్డి చిన్న వయసులోనే కరోనావైరస్‌తో చనిపోవడం చాలా బాధగా ఉందని ఆయన అన్నారు. సీపీ కులసుం పురా పోలీస్ స్టేషన్‌లో సేఫ్టీ ప్రికాషన్స్‌ను పరిశీలించారు. దయాకర్ రెడ్డికి మంచి పేరు ఉంది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. దయాకర్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం. ఆయన భార్యకు ఉద్యోగం కల్పించడంతో పాటు.. వారి పిల్లలను ఆదుకుంటాం. ఈ సంక్షోభంలో అందరం కరోనావైరస్‌తో పోరాడుతున్నాం. పోలీస్ డిపార్ట్‌మెంట్ కరోనా వారియర్ పని చేస్తుంది. పోలీసులందరూ 24 గంటలు కరోనావైరస్ నియంత్రణ కోసం పని చేస్తున్నారు. ముంబయిలో 900 మంది పోలీసులకు కరోనావైరస్ వచ్చింది. ప్రతి ఒక్కరూ సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోవాలి. ప్రతి రెండు గంటలకొకసారి చేతులను శానిటైజర్‌తో కడుక్కోవాలి. పోలీసులు ప్రజలతో మమేకమై డ్యూటీలు చేయాలి కాబట్టి పోలీసులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు, శానిటైజర్స్ వాడుతూ భౌతికదూరం పాటించాలి' అని ఆయన అన్నారు.

## ప్రేమపేరుతో యువకుల నయవంచన

### ఓ బాలిక మృతి... మరొకరు పోలీసులకు ఫిర్యాదు

రంగారెడ్డి,మే23(ఆర్ఎన్ఎ): ప్రేమపేరుతో వంచనకు గురైన ఓ బాలిక పోలీసులను ఆశ్రయిస్తే....మరో ఘటనలో బాలిక ఆత్మహ్యకు పాల్పడింది. ఒకటి రంగారెడ్డిలో మరోటి వరంగల్ జిల్లాలో జరిగింది. ప్రేమపేరుతో బాలికను నమ్మించి గర్భవతిని చేసిన ఓ యువకుడు ఇప్పుడామెను వదిలేశాడు. పెళ్లి చేసుకోమంటే కులం తక్కువ అంటూ వదిలేయడంతో

ఆ బాలిక పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన కొత్తూరు మండలంలోని మక్తగూడ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేందర్ (21), బాలిక ఏడాదిన్నర నుంచి ప్రేమించుకుంటున్నారు. ప్రేమమాయలో ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు ఆమెపై అత్యాచారం చేశాడు. తీరా పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు.

దీంతో రెండు రోజుల కిందట కుటుంబసభ్యులు గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. బాలికను వివాహం చేసుకోనని ఆ యువకుడు తేల్చిచెప్పాడు. దీంతో తనకు న్యాయం చేయాలని బాలిక తల్లిదండ్రులతో కలిసి పోలీసులను ఆశ్రయించింది.

ఈ విషయమై సీఐ చంద్రబాబును వివరణ కోరగా బాలిక ఫిర్యాదు వాస్తవమేనన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపోతే వరంగల్ రూరల్ జిల్లాలోని సంగెం మండలం లోహిత గ్రామంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ప్రేమపేరుతో గ్రామంలోని ఓ యువకుడు వేధింపులకు గురిచేయడంతో మనస్థాపం చెందిన బాలిక బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## నియంత్రిత విధానంలో సాగు చేసి రైతు రాజు కావాలి : మంత్రి సత్యవతి



ములుగు, మే 23: తెలంగాణ రైతు రాజు కావాలన్న సీఎం కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా నియంత్రిత విధానంలో వ్యవసాయం చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ రైతులను కోరారు.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన పంటలు పండించి రైతులు లాభపడాలని ఆమె ఆకాంక్షించారు. నియంత్రిత సాగుపై ములుగు జిల్లాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో దాదాపు 40 లక్షల బోర్లు, బావుల ద్వారా సాగు జరుగుతుండగా సీఎం కేసీఆర్ అపర భగీరథ కృషి వల్ల నేడు కాళేశ్వరం, దేవాదుల, ఎస్సారెస్పీ ద్వారా నీళ్లు వస్తున్నాయన్నారు. అదేవిధంగా రైతు బంధు, 24 కరెంట్ సరఫరా, గిట్టుబాటు ధర కల్పించడం వంటి చర్యలు చేపట్టారన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రూ. 30 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి దేశంలో కేసీఆర్ ఒక్కరే అన్నారు. నియంత్రిత విధానంలో సాగుచేసి మనకు కావాల్సినవి మనం పండించుకోవడంతో పాటు మార్కెట్‌లో మంచి ధర పలికే ధాన్యాన్ని పండించాలన్నారు. ఇందుకోసం అధికారులు రైతుల వెన్నంటి ఉండాలన్నారు. సరైన మార్గదర్శనం చేస్తూ వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, ఫెస్టిసైడ్స్‌ను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాలోతు కవిత, జడ్పీ ఛైర్మన్ కుసుమ జగదీశ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఇతర అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# దేశంలో కరోనా విలయతాండవం

### 6,654 కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదు

న్యూఢిల్లీ,మే23(ఆర్ఎన్ఎ): దేశంలో లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత కరోనా విలయతాండవం చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. రోజు రోజుకు కేసుల సంఖ్యలో పెరుగుదల నమోదు అవుతూనే ఉంది. తాజాగా నిన్న వీటి సంఖ్య గరిష్ట స్థాయికి చేరుకుంది. 6,654 కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడిం చింది. 137 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 1,25,101కి చేరుకోగా.. 3720 మంది మరణించారు. ప్రస్తుతం 69597 మంది వివిధ ఆస్పతుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మొత్తం కేసుల సంఖ్య 5,210,065 కాగా, మరణాల సంఖ్య 338,142 కు పెరిగింది. కరోనా పుట్టిన చైనా దేశంలో శుక్రవారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అక్కడి అధికారులు ప్రకటించారు. మరోవైపు అగ్రరాజ్య అమెరికా కరోనా విలయంతో కొట్టుమిట్టాడుతూనే ఉంది. అక్కడ 1,588,337 మందికి వైరస్ సోకింది. ఈ వ్యాధిబారిన పడి మరణించిన వారి సంఖ్య 95,276 కు చేరుకుంది.

## అమెరికాను మించి బ్రెజిల్‌లో మరణాలు

### పెరుగుతున్న కరోనా మృతుల కేసులు

రియోడిజానీరో,మే23(ఆర్ఎన్ఎ): గతనెల అమెరికాపై తీవ్ర ప్రభావం చూపిన కరోనా వైరస్ ఇప్పుడు లాటిన్ అమెరికాలోని బ్రెజిల్‌పై తన ప్రతాపం చూపుతోంది. గత నాలుగు రోజులుగా అక్కడ రోజుకు వెయ్యి మందికిపైగా మరణిస్తున్నారు. దీంతో శుక్రవారం నాటికి మొత్తం మృతుల సంఖ్య 21 వేలు దాటిందని వైద్యాధికారులు వెల్లడించారు. మరోవైపు కేసుల సంఖ్య కూడా 3,30,890కు చేరిందన్నారు. దీంతో అత్యధిక కరోనా కేసుల జాబితాలో బ్రెజిల్.. రష్యాను దాటి రెండో స్థానానికి చేరింది. గడిచిన 24 గంటల్లో అక్కడ 1001 మంది మరణించారని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు బ్రెజిల్‌లో పేర్కొన్న అధికారిక గణాంకాల కన్నా ఆ కేసులు మరింత ఎక్కువే ఉంటాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఇటీవల ఆ దేశాన్ని 'కొత్త కరోనా హాట్‌స్పాట్‌గా' ప్రకటించింది. లాటిన్ అమెరికాలో చాలా దేశాలు కరోనాతో సతమతమవుతున్నాయని, ముఖ్యంగా బ్రెజిల్ పరిస్థితి దారుణంగా ఉందని డబ్ల్యూహెచ్‌వో ఎమ్జ్గ÷న్సీస్ డైరెక్టర్ మైక్ ర్యాన్ పేర్కొన్నారు. ఇక అత్యధిక కేసుల జాబితాలో అమెరికా 16 లక్షలు దాటిన సంగతి తెలిసిందే. మృతుల సంఖ్య 96 వేలుగా నమోదైంది. 3,26,488 కేసులతో రష్యా మూడో స్థానంలో నిలవగా, 3200 మంది మృతిచెందారు. బ్రెజిల్ ప్రస్తుతం మరణాల సంఖ్యలో ఆరో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అమెరికా, బ్రిటన్, ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్ అంతకన్నా ముందున్నాయి.

# ఆర్‌బిఐ నిర్మొహమాటంగా ఉండాలి

### ఆర్థిక స్థితిపై ప్రభుత్వానికి దాపరికం లేకుండా చెప్పాలి
### మాజీకేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం సూచన

న్యూఢిల్లీ,మే23(ఆర్ఎన్ఎ): కరోనా సంక్షోభ కాలంలో ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ కోసం కృషి చేస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)కు కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కీలక సూచన చేశారు. ఆర్‌బీఐ సత్వర చర్యల్ని కొనియాడిన ఆయన తమ కర్తవ్య నిర్వహణపై నిర్మొహమాటంగా వ్యవహరించాలని సలహా ఇచ్చారు. తమ డ్యూటీ తమను చేసుకోనివ్వమని మొహమాటం లేకుండా ప్రభుత్వానికి గట్టిగా చెబుతూనే, ఆర్థిక చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు చిదంబరం శనివారం సూచించారు. డిమాండ్ పడిపోతోందనీ, 2020–21లో వృద్ధి ప్రతికూలతవైపు మళ్లుతోందని చెబుతున్న శక్తికాంత దాస్ ఎక్కువ ద్రవ్య లభ్యతను ఎందుకు సమకూరు స్తున్నారంటూ ట్వీట్ చేశారు. మరోవైపు ఆర్థిక వ్యవస్థ దుస్థితిపై కేంద్రంపై మాజీ ఆర్థికమంత్రి చిదంబరం మండిపడ్డారు. జీడీపీ క్షీణిస్తోందని స్వయంగా ఆర్‌బిఐ గవర్నర్ చెబుతున్నా, జీడీపీలో 1 శాతం కంటే తక్కువగా ఉన్న ప్యాకేజీపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ప్రభుత్వం ప్రగల్భాలు పోతున్నారని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పతనానికి కారణమైన ప్రభుత్వ విధానాలపై ఆర్ఎస్ఎస్ సిగ్గుడాలని వ్యాఖ్యానించారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఈ సంవత్సరం తగ్గిపోతుందని ప్రభుత్వం ప్రతినిధి, లేదా సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన కీలక వ్యక్తులు ఇలా ప్రకటించిడం ఇదే మొదటిసారి. కాగా కరోనా వైరస్,లాక్‌డౌన్ ఆందోళనల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి నెగిటివ్ జోన్‌లోకి జారిపోతోంది. దీంతో శుక్రవారం నాటి పాలసీ రివ్యూలో రెపో రేటును 4.0 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే.

## చరిత్రలో నేటినిజం



30॥ 'జీవిత' సద్గుణములన్నియు
పావన వదనమ్ము నందు పలికించుచు-స
ద్భావములకు నిలయముగా
"జీవిత" వెలుగొందు "రాజశేఖరు" మదిలోన్!!



-రాధశ్రీ

సెల్: 9494481210

(మే 24 జీవిత జన్మదినం..)

